క్లుప్తంగా

కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం



మాట్లాడుతున్న కరణం శ్రీనివాసరావు

రేగిడి: బీసీ మహిళ, ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన మూకలు దాడిచేయడం అత్యంత హేయమైన చర్యని రాజాం నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా జిల్లా గుడివాడలో వైఎస్సార్‌సీపీ సమావేశానికి కారులో వెళుతున్న ఆ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై టీడీపీ,జనసేన మూకలు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లా ప్రథమ పౌరురాలు, కేబినెట్ హోదాకలిగిన మహిళా ప్రజాప్రతినిధికి రక్షణ కల్పించలేకపోయిన కూటమి ప్రభుత్వ పెద్దలు సిగ్గుతో తల దించుకోవాలన్నారు. మహిళలపై దాడులు చేసే హీన సంస్కృతిని కూటమి నేతలు ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు.

తహసీల్దార్‌కు అభినందనలు



తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను అభినందనలు తెలుపుతున్న, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్న మండల తహసీల్దార్ హేమంత్ కుమార్‌ను ముఖ్యమంత్రి కార్యాలయం అభినందించిన విషయం తెలిసిందే. మండల ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది సోమవారం తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కార్యాలయ అధికారులు, వీఆర్ఓలు, సిబ్బంది సమష్టి కృషితోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించగలిగానని చెప్పారు.


రేషన్ డీలర్‌పై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, గిరిజనులు

బొబ్బిలిరూరల్: మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామానికి చెందిన రేషన్ డీలర్ లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు, గిరిజనులు తహసీల్దార్ ఎం.శ్రీనుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకుడు ఒమ్మి రమణ మాట్లాడుతూ కొయ్యి కొండవలస, చెల్లివలస, మూలవలస తదితర గిరిజన గ్రామాల ప్రజలకు నిమ్మలపాడు రేషన్ దుకాణం ద్వారా సరుకులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అమాయక గిరిజను లతో రేషన్ డీలర్ బయోమెట్రిక్ వేయించుకుని సరుకులు ఇవ్వకుండా తర్వాత రమ్మని పంపించేస్తున్నాడని, మళ్లీ వెళితే సరుకులు అయిపోయాయని చీదరించుకుని పొమ్మంటున్నాడని ఆరోపించారు. డీలర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం



ట్రెంచ్ కట్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బొబ్బిలిరూరల్: మండలంలోని సీహెచ్.బొడ్డవలస, శివడవలస పంచాయతీల్లో నేషనల్ లెవెల్ మోనటరింగ్ (ఎన్ఎల్ఎం)సభ్యులు,రీసెర్చ్ ప్రొఫెసర్ సునీల్‌బంట,నాతూసింగ్ సోమవారం పర్యటించారు. ఆయా పంచాయతీల్లోని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్య నిధులతో ఉపాధి హామీ, వెలుగు,పంచాయతీ రాజ్,హౌసింగ్ శాఖల ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు,నీటి కుంటలు, ట్రెంచ్‌కటింగ్,తదితర పనులను పరిశీలించారు.శివడవలస సచివాలయంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశమై సంఘాల లావాదేవీల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎంపీడీఓ పి.రవికుమార్, హౌసింగ్ ఈఈ రంగారావు, ఏపీఓ కె.ఎల్.రాజు,ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏఈ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

వాహన తనిఖీలు

వంగర: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం డ్రంక్‌అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

కుక్కల నివారణ.. చర్యలు శూన్యం

- గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం
- నివారణపై పట్టించుకోని అధికారులు
- రామభద్రపురం మండలంలో ఆరు నెలల్లో కుక్క కాటుకు గురైన వారి సంఖ్య: 250
- భయాందోళనలో ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన సత్తారు సీతారాం. ఇతన్ని ఈ ఏడాది మే నెలలో కుక్క కరిచింది. రేబిస్ వ్యాధి సోకడంతో చికిత్స పొందుతూ అదే నెల 28వ తేదీన మృతి చెందాడు.దాంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.



రామభద్రపురంలోని ఓ వీధిలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

రామభద్రపురం: మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.ఎక్కడ చూసినా గుంపులు,గుంపులుగా సంచరిస్తూ చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ వాటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. విచ్చల విడిగా జనావాసాల మధ్యనే స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై ద్విచక్రవాహన చోదకులను వెంబడిస్తూ వారిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులతో పాటు గొర్రెలు, మేకలు, ఆవుదూడలు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు వారిపై ఎగబడి గాయప రుస్తున్నాయి.మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వెళ్లే వారికి కూడా కుక్కల బెడద తప్పడం లేదు.

ఆరు నెలల వ్యవధిలో 250 మందిపై దాడి

రామభద్రపురం మండలంలో ఈ ఏడాది జనవరి నెల నుంచి జూలై 12వ తేదీ వరకు సుమా రు 250 మంది కుక్కల దాడిలో గాయపడి రామభద్రపురం ,ఆరికతోట పీహెచ్‌సీల్లో చికిత్స పొందినట్టు అక్కడి రికార్డులు చెబుతున్నాయి. కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సోకితో ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు వాటికి శస్త్ర చికిత్సలు చేయించడం వంటి చర్యలు ఎక్కడా కానరావడం లేదు.

కుక్క కాటుకు గురైనప్పుడు ఇలా చేయండి..

ఏ కుక్క కరిచినా సరే వెంటనే పైనుంచి పడే శుభ్రమైన నీటి కింద కడగాలి. అంటే కుళాయి కింద గాయాన్ని ఉంచి కానీ, మగ్‌తో నీళ్లు పోస్తూ కానీ సబ్బు) కడగాలి. ఇలా చేయడం వల్ల 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు.రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ మరింత వ్యాపించే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. వైద్యుల సూచనల మేరకు మూడు లేదా అయిదు మార్లు వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉంటుంది. కుక్కకాటుకు గురైన వారి లక్షణాలను 14 రోజుల పాటు పరిశీలించాలి. సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకుతుందన్న భావన ఉంటుంది.వీధికుక్కలే కాదు పెంపుడు కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఏ కుక్క కరిచినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. వ్యాక్సిన్ వేయించుకోకుండా అశ్రద్ధ చేస్తే రేబిస్ వ్యాధి బారిన పడి చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాలను తీస్తుంది.

గుంపులుగా తిరుగుతున్నాయి..



పిల్లలను ఆటలు ఆడుకునేందుకు వీధుల్లోకి వదిలేందుకు భయంగా ఉంది. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి.ఎక్కడ పిల్లలను కరుస్తాయోనని భయమేస్తోంది.

– పైల మరియ, రామభద్రపురం

దూడను చంపేశాయి..



కుక్కలు పొలాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దూడలను బయట వదిలేందుకు భయంగా ఉంది. గతంలో కూడా మా దూడను కుక్కలు కరిచి చంపేశాయి.

– చొక్కాపు ఈశ్వరరావు,రామభద్రపురం

నిర్లక్ష్యం చేయొద్దు..



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి.అదేం చేస్తుందిలే అనుకుంటే ప్రాణానికి ముప్పు తప్పదు.ఆ కుక్క పెంపుడు కుక్క అయినా,వీధి కుక్క అయినా నిర్లక్ష్యం చేయొద్దు.కనీసం 5 నుంచి 7 ఇంజెక్షన్లు చేసుకోవాల్సిందే. కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్‌కు ఆస్పత్రిలో కొరత లేదు.

– జి.లక్ష్మి,వైద్యాధికారి, రామభద్రపురం పీహెచ్‌సీ

కేసుల రాజీలో మధ్యవర్తిత్వమే కీలకం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: పలు కేసులకు సంబంధించి రాజీ కుదర్చడంలో మధ్యవర్తిత్వమే కీలకమని రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక సీనియర్, జూనియర్ కోర్టుల సముదాయంలో సోమవారం న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆమట్లాడుతూ రానున్న రోజుల్లో మధ్యవర్తిత్వం కీలకం కానుందని, దీనిపై అవగాహన కల్పించేందుకు జూలై నుంచి 90 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. వివాహానికి సంబంధించిన కేసులు, గృహహింస, చెక్‌బౌన్స్, సివిల్, రాజీకీ అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించనున్నామని చెప్పారు. శిక్షణ పొందిన న్యాయవాదులతో మధ్యవర్తిత్వం చేయనున్నామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకుని వారి కేసుల్లో కక్షిదారులకు ఈ విషయం తెలియజేయాలని, అలాగే పారాలీగల్ వలంటీర్లు ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం మధ్యవర్తిత్వం కోసం ఏర్పాటుచేసిన హాల్‌ను పరిశీలించారు. ఈనెల 16 వరకు కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు కోర్టు ప్రాంగణంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నా రు. అనంతరం మధ్యవర్తిత్వానికి సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.మురళీధరరావు, కార్యదర్శి బి.తిరుపతినా యుడు, న్యాయవాదులు ఎస్.పోలారావు, ఆర్.విజయ్‌కుమార్, శ్రీనివాస్, తదిరులు పాల్గొన్నారు.

ఒక బస్తా యూరియా కూడా ఇవ్వలేదు



జెడ్పీటీసీ బండి నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక పంచాయతీ పరిధి రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రం నుంచి ఒక్క యూరియా బస్తా కూడా పంపిణీ చేయలేదని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు ఆరోపించారు. రాజాంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనుబాక గ్రామ రైతులకు గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రం ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేవని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ఇబ్బందులు అధికమయ్యా యని దుయ్యబట్టారు. ఖరీఫ్ సాగుపనులు ప్రారంభమై నెల రోజులు కావస్తోందని, తమ గ్రామపరిధిలో రైతులు వరితో పాటు మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నారని చెప్పారు. పంటలకు ఎరువు అందించేందుకు అదును దాటిపోతోందని, యూరియా లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాలుగువేలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్‌పంటలు సాగవుతుండగా, గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి ఒక్క బస్తా ఎరువు కూడా ప్రభుత్వం సరఫరా చేయలేదని మండిపడ్డారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి పెనుబాకతో పాటు మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేయాలని కోరారు.

• ప్రమాణ స్వీకారం



బొబ్బిలి రోటరీక్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది.ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ కె.వి.అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గం తో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణగోపాల్ అగర్వాల్ ప్రమాణం చేయించారు. అధ్యక్షుడిగా వారణాసి శ్రీహరి,కార్యదర్శిగా కె.శివకాంత్,కోశాధికారిగా డేవిడ్ జె.విక్టర్,గౌరవ అధ్యక్షుడిగా టి.ఎస్.ఎస్.కార్తీక్, ఈడీగా సింద్రీ శ్రీనివాసన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కె.నాగరాజు, విమెన్ ఎంపవర్ మెంట్‌గా న్యాయవాది డి.లక్ష్మీదీపవల్లి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్‌కు జిల్లా చైర్మన్ జె.సి.రాజు వంద డాలర్లు, శ్రీహరి, శివకాంత్, గెంబలి శ్రీనివాసరావు మూడు వందల డాలర్లు అందజేశారు. ఎస్‌టీఓ కె.వి. పద్మనాభం తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రేగిడి: వంగర, రాజాం, రేగిడి మండలాలను అనుసంధానం చేసే మండలంలోని ఉణుకూరు రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు ఉణుకూరులో సోమవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ రోడ్డులో 80 గ్రామాలకు చెందిన ప్రజలు ఆటోలు, ద్విచక్రవాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. రోడ్డులో ఎక్కడికక్కడే పెద్ద పెద్ద గోతులు ఉండడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగుచేయాలని ఆందోళన చేస్తే సెక్షన్ 30 ప్రకారం అరెస్టు చేస్తామని పోలీసు లు ప్రజలను భయపెడుతున్నారని, ఇది ప్రజల హక్కులను కాలరాయడమే నని అన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు, ఎం.త్రినాథ్, దుర్గారావు, వి.లక్ష్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై ఆరా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ సీజీఎం రాజగోపాల్

రామభద్రపురం: పీఎంజీకేవై పథకం కింద ఉచిత రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అని ఎఫ్‌సీఐ సీజీఎం ఏ.రాజగోపాల్ లబ్ధిదారులను ఆరా తీశారు. మండల కేంద్రంలోని చొక్కాపు వీధిలో రేషన్ డిపో–1ను ఎఫ్‌సీఐ ఏజీఎంలు సునీల్‌కుమార్,సందీప్ శంకర్,డీఎస్ఓ మధుసూదనరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మమేకమై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం సక్రమంగా అందుతున్నాయా లేదా, థంబ్ వేస్తున్నారా లేదా, థంబ్ పడకపోతే రేషన్ ఎలా తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డుల్లో సభ్యుల యాడింగ్, స్ప్లిట్ చేసే ప్రక్రియ గురించి తెలుసా తెలియదా అన్ని ప్రశ్నించగా...కార్డులో యాడింగ్, స్ప్లిటింగ్ కావడం లేదని పలువురు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డీటీ గిరిధర్,సీఎస్‌డీటీ సాయికృష్ణ, రేషన్ డీలర్ చొక్కాపు రామారావు పాల్గొన్నారు.

• పరామర్శ



రేగిడి: జగ్గునాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు



సంతకవిటి: మహేశ్వరరావు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: ఎస్.రంగరాయపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పున్నాన మహేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు సోమవారం పరామర్శించారు. మహేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ యినుమల జనార్దనరావు, ఎంపీటీసీ యినుమల మురళీకృష్ణ, వైస్ సర్పంచ్ యినుమల సీతాపతి, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కామేశ్వరరావు కుటుంబానికి...



బాడంగి: కామేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చింతలపూడి శ్రీనివాసరావు తండ్రి కామేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. శంబంగి వెంట బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీకృష్ణ, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శ

రేగిడి: ఖండ్యాం గ్రామానికి చెందిన రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొలివి జగ్గునాయుడు భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం జగ్గునాయుడును పరామర్శించి ఆయన భార్య ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పొనుగుటివలసలో మెగా వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత సాధారణ, నేత్ర వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు తల్లి శాసపు జయప్రద జయంతిని పురస్కరించుకుని రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ప్రారంభించారు.శిబిరంలో 200 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలతో పాటు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 39 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. వెలుగు రామినాయుడు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పాలవలస శ్యామసుందర్, రెడ్డి రమేష్, గార సత్యనారాయణ, శాసపు బాబూరావు, శాసపు జగన్, గోకవలస బాబూరావు, డాక్టర్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీఐలో జాబ్ మేళా

బొబ్బిలి :పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.వి. శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ నిర్వహించను న్న ఈ జాబ్ మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులైన వారితో పాటు ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతూ పరీక్షలకు సిద్ధంగా ఉన్న వారు కూడా హాజరు కావొచ్చని పేర్కొన్నారు. అర్హులు తమ టెన్త్,ఐటీఐ మార్కుల లిస్ట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకు రావాలని స్పష్టం చేశారు.

మిగులు సీట్లకు ధరఖాస్తులాహ్వానం

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లలో చేరేందుకు విద్యార్థుల నుంచి ధరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారుకు వచ్చే యూనిక్ కోడ్ నంబర్‌ను భద్రపరచుకోవాలని తెలియజేశారు. అభ్యర్థులు ఈనెల 23న జరిగే కౌన్సిలింగ్‌కు అన్ని ధ్రువపత్రాలతో నేరుగా ఐటీఐలో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ఐటీఐ కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

రేగిడి: మండలంలోని ఆడవరం, సోమరాజుపేట, జోడుబంద గ్రామాల్లో సోమవారం మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ పనులను ఏఈ వావిలపల్లి సురేష్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఈ జి.సురేష్, డీఈఈ ఫణీంద్రకుమార్ ఆదేశాలతో ఆడవరం, సోమరాజుపేట, జోడుబంద గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సంక్షిప్తంగా..


ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఆరికతోటలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రామభద్రపురం: మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.అప్పనాయుడు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలాస వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.రామారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు.దుకాణాల్లో విత్తనాలు,పురుగు మందులు,ఎరువుల నిల్వలు,రికార్డులను పరిశీలించారు. నిషేధిత ఎరువులు, పురుగు మందులు,విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. వారి వెంట స్థానిక ఏడీ శ్రీనివాసరావు,ఏఓ శివ, వీఏఏలు ఉన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, తదితరులు

రాజాం: స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన ఫ్యూజన్ ఫైనాన్స్ కంపెనీ బ్యాగు లు, నోట్ పుస్తకాలు వితరణ చేసింది. పాఠశాలలోని వందమంది విద్యార్థులకు ఎంఈఓ యాగాటి దుర్గారావు చేతుల మీదుగా వాటిని సోమవారం పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.రమణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బొబ్బిలి: పట్టణంలోని నేను సైతం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. వివిధ ఆలయా లు, ఇతర కూడళ్లలో ఉన్న నిరుపేదలకు నిర్వాహకులు గౌరీ సంతోష్ కుమార్ భోజనం ప్యాకెట్లు అందజేశారు.

కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలంతా సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని బాడంగి ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ సూచించారు. మండలంలోని కూనాయవలస, జన్నివలస గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరు, స్టాక్ రికార్డులు, పిల్లల బరువులు, ఎత్తుల వివరాలు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. రికార్డులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సక్రమంగా నిర్వహించాలని, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొత్తవలస ప్రాథమిక పాఠశాలకు పట్టణానికి చెందిన కేబుల్ ఆపరేటర్ వేటూరి సూర్యప్రకాష్ అయిదు కుర్చీలు వితరణ చేశారు. హెచ్ఎం ఎస్.భానుప్రకాష్ మాట్లాడుతూ దాతలు, గ్రామస్తులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు అనిల్, వెంకటినాయుడు, రామారావు, సురేష్, రమేష్, సింహాచలం పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులాహ్వానం

రాజాం సిటీ: స్థానిక ఐటీఐలో మిగులు సీట్లకు సంబంధించి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అనంతరం 22న ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. 23న జరగనున్న రెండో విడత కౌన్సెలింగ్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 90000 96048, 83094 38446, 99595 02238 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు అన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓ కల్యాణమండపంలో సోమవారం మొక్కల పంపిణీ చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ, ఏఎంసీ సేవా సంస్థ, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బొబ్బిలిరూరల్: సచివాయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలందించాలని,ఇతర పనుల పేరుతో విధులనుంచి తప్పించుకుంటే చర్యలు తప్పవని డీడీఓ కిరణ్‌కుమార్ హెచ్చరించారు.సీహెచ్ బొడ్డవలస సచివాలయంలో సోమవారం తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులు పరిశీలించారు. సర్వేలు, ఇతర విధులకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.డీడీఓ వెంట ఎంపీడీఓ పి.కిరణ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ ఏ.భాస్కరరావు ఉన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే చర్యలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఎంఈఓ జె.త్రినాథరావు హెచ్చరించారు. తమ్మయ్యవలస ఫౌండేషన్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు.పాఠశాలలోని మరుగుదొడ్లను రోజూ శుభ్రం చేయాలని స్కావెంజర్స్‌ని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: పట్టణ పరిధి గాయత్రీ కాలనీలోని హోసన్న అపోస్టలిక్ ప్రార్థనామందిరంలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా పాస్టర్ కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా యం.యెహోషువా, కార్యదర్శిగా పీటర్, జాయింట్ కార్యదర్శిగా తేజేష్, ట్రెజరర్‌గా షాలేమ్, యేసేపు, గౌరవ అధ్యక్షులు, సలహాదారుగా ఎం.ఏ.రాజు, ప్రభుకుమార్, ఆంద్రూస్, జాన్‌వసంత్‌కుమార్, పౌలు, ఏసు పాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.